
సాక్షి
తూర్పుగోదావరి

శనివారం । 28 । అక్టోబర్ । 2023



నిత్యాభిషేకానికి విరాళం

సఖినేటిపల్లి:అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శాశ్వత నిత్యాభిషేకానికి టి.గురువారెడ్డి, రమాదేవి దంపతులు(హైదరాబాద్) రూ.50,000 విరాళం అందజేశారు.



డెల్టాలకు నీరు

ధవళేశ్వరం: డెల్టా కాలువలకు సంబంధించి శుక్రవారం 10,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 4,300, మధ్యడెల్టాకు 2,600, పశ్చిమడెల్టాకు 4,000 క్యూసెక్కుల నీటిని వదిలారు

అన్నదాన భవన నిర్మాణానికి రూ.1,01,116



ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న ఆలయంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి వంటరం వెంకట రవికుమార్, విజయలక్ష్మి దంపతులు (హైదరాబాద్) రూ.1,01,116 విరాళం అందించారు.

న్యూస్‌రీల్

నిజం గెలవాలంటూ అబద్ధాల ప్రచారం



ఆరిఫ్, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్

సీటీఆర్‌ఐ(రాజమహేంద్రవరం సిటీ): నిజం గెలవాలి అనే పేరుతో అబద్ధాలను ప్రచారం చేయడం నారా భువనేశ్వరికి తగదని వక్ఫ్‌బోర్డ్ జిల్లా చైర్మన్ మహమ్మద్ ఆరిఫ్ హితవు పలికారు. జాంపేటలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. తమ కుటుంబ కష్టాలను రాష్ట్ర విపత్తుగా జనం ముందు పెట్టాలని చంద్రబాబు కుటుంబం తీవ్ర ప్రయత్నం చేస్తోందన్నారు. చంద్రబాబు నాయుడు అవినీతిపరుడని రాష్ట్ర ప్రజలు నమ్మారు కాబట్టే, ఆయన జైల్లో ఉన్నా ఎటువంటి స్పందనా లేదన్నారు. సాధారణంగా మృతి చెందిన వారిని కూడా తమకు అనుకూలంగా వాడుకోవాలని చంద్రబాబు కుటుంబం ప్రయత్నిస్తూ యాత్ర చేపట్టిందన్నారు. చంద్రబాబు ప్రచారయావ వల్ల గత పుష్కరాలలో చనిపోయిన వారి కుటుంబాలను ఎందుకు పరామర్శించి ఆదుకోవడం లేదని ప్రశ్నించారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోయి తమ జీవితాలను నాశనం చేసుకున్న యువకులను పరామర్శించి, వారికి న్యాయం చేసిన నాడే భువనేశ్వరి చేసే యాత్రలకు అర్థం ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి జగన్ పాలనపై ప్రజలందరూ హర్షం వ్యక్తం చేస్తూ, ఆయనకు మద్దతుగా ఉన్నారన్నారు. రాష్ట్రంలోని సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా మారాయన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఏపీవీవీపీ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిన భర్తీ చేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా వైద్యసేవల సమన్వయాధికారి ఎం.సనత్‌కుమారి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఫార్మాసిస్ట్ గ్రేడ్ 2 ఒక పోస్టు, ఆడియో మెట్రిషియన్ ఒక పోస్టును కాంట్రాక్టు పద్ధతిలో, ల్యాబ్ అటెండెంట్ ఒక పోస్టు అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నామన్నారు. ఆసక్తి కలవారు ఈస్ట్‌గోదావరి.నిక్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు పొందవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను నవంబర్ మూడో తేదీలోగా కొవ్వూరులోని జిల్లా వైద్యసేవల సమన్వయాధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు



రాజమహేంద్రవరం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పలు సచివాలయాల్లో శనివారం వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఒక ప్రకటనలో తెలిపారు. బలభద్రపురం-3 (బిక్కవోలు), అచ్యుతాపురం(గోకవరం), కడియం-3 (కడియం), నిడిగట్ల(కోరుకొండ), మ ద్దూరు (కొవ్వూరు), తెలికచర్ల-2(నల్లజర్ల), రావిమెట్ల (నిడదవోలు), కొత్తపల్లి అగ్రహారం(పెరవలి),హుకుంపేట-3(రాజమహేంద్రవ రం రూరల్), సీతారామపురం(రాజానగరం), మర్రిపూడి(రంగంపేట), మిర్తిపాడు (సీతానగరం), వేగేశ్వరపురం-2(తాళ్లపూడి), వేలివెన్ను-2(ఉండ్రాజవరం), అంబేద్కర్‌నగర్ యూపీహెచ్‌సీ, ఆనందనగర్ యూపీహెచ్‌సీ, కంబాలపేట యూపీహెచ్‌సీ, మెరకవీధి యూపీహెచ్‌సీ, సారంగధరమెట్ట యూపీహెచ్‌సీ (రాజమహేంద్రవరం అర్బన్)లలో జరుగుతాయన్నారు.

నేడు జరగాల్సిన లాన్ టెన్నిస్ ఎంపికలు వాయిదా

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): పాఠశాల క్రీడాసమాఖ్య అండర్-14, 17 ఆధ్వర్యంలో శనివారం కాకినాడ ఆర్ఎంసీ ప్రాంగణంలో జరగాల్సిన లాన్‌టెన్నిస్ పోటీలు వాయిదా వేస్తున్నట్లు సమాఖ్య కార్యదర్శి ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఎంపికలు జరిగే తేదీలు తరువాత తెలియజేస్తామన్నారు. ఈ మార్పును గమనించి లాన్‌టెన్నిస్ ఎంపికలకు రిజిస్టర్ చేసుకున్న క్రీడాకారులు కాకినాడ రావద్దని కోరారు.

42 ఐఈఆర్‌పీ పోస్టుల భర్తీ

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సమగ్ర శిక్ష, భవిత కేంద్రాల్లో 42 ఐఈఆర్‌పీ పోస్టుల్ని భర్తీ చేశారు. వీరికి కలెక్టర్ కృతికా శుక్లా శుక్రవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈనెల 3 నుంచి 5వతేదీ వరకు సర్టిఫికెట్లను పరిశీలించి రోస్టర్ ప్రకారం ఈనెల 20, 21 తేదీల్లో స్కిల్ టెస్ట్ నిర్వహించినట్లు జిల్లా సంహిత విద్యా సమన్వయకర్త చామంతి నాగేశ్వరరావు వివరించారు. 18 ఎంఆర్ కేటగిరి పోస్టులకు, 22 హెచ్ఐ/విఐ కేటగిరికి చెందిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. జాయింట్ కలెక్టర్ ఇలక్కియ, రీజినల్ జాయింట్ డైరెక్టర్ జి నాగమణి, జిల్లా సహిత విద్యా సమన్వయకర్త చామంతి నాగేశ్వరరావు, కార్యాలయపు సిబ్బంది పాల్గొన్నారు.

ఆమే నిర్ణేత.!



- వచ్చే ఎన్నికల్లో తిరుగులేని శక్తిగా అతివలు
- ఓటరు జాబితాలో మహిళలే అధికం
- తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పన
- ఓటర్ల ముసాయిదా వెలువరించిన కలెక్టర్
- ఎన్నికలకు సిద్ధమవుతున్న యంత్రాంగం
- ఇప్పటికే రెండు దఫాలుగా వీపీప్యాట్ల తనిఖీలు



సాక్షి, రాజమహేంద్రవరం: మహిళా లోకం తిరుగులేని శక్తిగా అవతరిస్తోంది. రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రభుత్వాన్ని నిర్ణయించే ధీశాలిగా వ్యవహరించనుంది. ఓటరు జాబితాలో పురుషుల కంటే ఎక్కువగా ఉంది మొదటి స్థానంలో నిలిచింది. 2024 జనవరిలో ప్రచురించే ఓటర్ల ముసాయిదా జాబితాను రాజమహేంద్రరం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కె.మాధవీలత శుక్రవారం విడుదల చేశారు. వివిధ రాజకీయ పార్టీల నేతల సమక్షంలో జాబితా వెల్లడించారు. అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు, దరఖాస్తు చేసుకునేందుకు డిసెంబర్ 12వ తేదీ వరకు అవకాశం కల్పించారు. వచ్చే ఏడాది జనవరిలో తుది జాబితా ప్రచురిస్తారు. తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా మొత్తం ఓటర్లు 15,60,354 ఉన్నారు. పురుషులు 7,63,694, మహిళలు 7,96,552, ఇతరులు 108 మంది ఉన్నారు. అందులో పురుషుల కంటే 32,858 ఓట్లు అత్యధికంగా మహిళలవి ఉండటం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.

జిల్లాలో ఓటర్ల సంఖ్య ఇలా..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు
అనపర్తి	1,06,664	1,10,669	3
రాజానగరం	1,03,017	1,05,032	9
రాజమండ్రి సిటీ	1,23,110	1,32,088	64
రాజమండ్రి రూరల్	1,26,425	1,32,349	12
కొవ్వూరు	86,855	91,272	6
నిడదవోలు	1,01,924	1,06,131	7
గోపాలపురం	1,15,699	1,19,011	7

తప్పుల్లేని జాబితా

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎన్నికల కమిషన్ నిర్వహణపై దృష్టి సారించింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పనపై దృష్టి సారించింది. ఈ ఏడాది జనవరి నుంచి ఇంటింటా ఓటర్ల గుర్తింపు సర్వే చేపట్టింది. డూప్లికేట్ ఓటర్లపై ప్రత్యేక పరిశీలన చేపట్టింది. ఎన్నికల కమిషన్ రూపొందించిన సాఫ్ట్‌వేర్ ద్వారా పీఎస్ఈ(ఫొటో సిమిలర్ ఎంట్రీ), డీఎస్ఈ (డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీ) ఓట్లను గుర్తించారు. ఒక వ్యక్తికి ఒకటికి మించి రెండో ఓటును గుర్తించేందుకు ఎన్నికల సంఘం తెచ్చిన సాఫ్ట్‌వేర్ ఎంతగానో ఉపయుక్తంగా మారింది. జిల్లా వ్యాప్తంగా నకిలీ, డూప్లికేషన్, మృతి చెందిన వ్యక్తుల ఓట్ల తొలగింపు ప్రక్రియ చేపట్టారు. ఓటర్ల గుర్తింపు, ఒకే డోర్ నంబర్‌పై ఎక్కువ మంది ఓటర్లు, మరణించిన, శాశ్వత చిరునామా మార్పు, సారూప్యత కలిగిన ఓటర్ల గుర్తింపుపై క్షేత్ర స్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టారు.

పక్కాగా నమోదు ప్రక్రియ

కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ పక్కాగా చేపట్టారు. రాజకీయ నేతల అభ్యర్థనలు పరిగణలోకి తీసుకున్న అధికార యంత్రాంగం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కొత్త ఓటు నమోదు చేశారు. తూర్పుగోదావరి జిల్లాగా ఆవిర్భవించిన అనంతరం మొదటి సారిగా ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేస్తోంది. ఇప్పటి వరకు కాకినాడలో ఓట్ల లెక్కింపు జరుగుతోంది. వచ్చే ఎన్నికల్లో లెక్కింపు ప్రక్రియ రాజమహేంద్రవరంలోనే జరగనుంది. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో ఎఫ్‌సీఐ గోదాములో ఈవీఎంలు భద్రపరిచారు. ఈవీఎంల పనితీరు, భద్రతపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ తనిఖీలు సైతం చేపట్టారు. జిల్లాలో 5,971 బ్యాలెట్ యూనిట్లు, 5,463 కంట్రోల్ యూనిట్లు, 4,927 వీవీ ప్యాట్లు ఉన్నాయి.

రిటర్నింగ్ అధికారుల నియామకం

ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్‌కు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. జిల్లా వ్యాప్తంగా పోలింగ్ స్టేషన్లను సైతం ఇప్పటికే గుర్తించింది. జిల్లాలో 1569 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు నిర్ధారించారు. కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు సైతం పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా సర్వీస్ ఓటర్లు (సైనికులు, కుటుంబ సభ్యులు) 718 ఉన్నట్లు వెల్లడించారు. అనపర్తిలో 47, రాజానగరంలో 68, రాజమండ్రి సిటీ 115, రాజమండ్రి రూరల్ 113, కొవ్వూరు 111, నిడదవోలు 178, గోపాలపురం నియోజకవర్గంలో 86 మంది ఉన్నారు.

తప్పుల్లేని జాబితా రూపకల్పన



తప్పుల్లేని ఓటర్ల జాబితా రూపకల్పనే లక్ష్యంగా పనిచేశాం. క్షేత్ర స్థాయిలో నియోజకవర్గ ఈఆర్‌ఓలు అత్యంత బాధ్యతగా విధులు నిర్వర్తించారు. ఓటర్ల మార్పులు, చేర్పులు, తొలగింపులపై సునిశిత పరిశీలన చేపట్టాం. రాజకీయ పార్టీల నేతల అభ్యంతరాలకు అనుగుణంగా చర్యలు తీసుకున్నాం. 2024 జనవరిలో ప్రచురించే ఓటర్ల ముసాయిదా రాజకీయ పార్టీల నేతల సమక్షంలో విడుదల చేశాం. కొత్త జిల్లాలో తొలి సారి ఎన్నికలు, కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో ఈవీఎంల భద్రతకు అత్యంత ప్రాధాన్యత కల్పించాం. ఇప్పటికే తనిఖీలు సైతం పూర్తి చేశాం.

– కె.మాధవీలత, జిల్లా కలెక్టర్

జాతీయ క్రీడలకు సాంకేతిక అధికారిగా వాసు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): గోవాలో ఈనెల 26 నుంచి నవబంరు 9 వరకు జరిగే జాతీయ క్రీడలు కబడ్డీ విభాగంలో జిల్లాకు చెందిన పీడీ, కబడ్డీ రిఫరీ శ్రీనివాస్ కుమార్ సాంకేతిక అధికారిగా నియమితులయ్యారు. ఈమేరకు కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. వచ్చేనెల 1వ తేదీన ఆయన బయలుదేరి గోవా వెళ్ళనున్నారు. శ్రీనివాస్ గతంలో కూడా ఖేలో ఇండియా పోటీలకు సాంకేతిక అధికారిగా హాజరయ్యారు.

ఖోఖో పోటీలలో ప్రథమస్థానం

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): చిత్తూరు జిల్లాలో ఈనెల 20 నుంచి 22 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్స్ ఖోఖో పోటీలలో ఉమ్మడితూర్పు గోదావరి జిల్లా జట్టు పాల్గొని ప్రతిభను కనపరచింది. ప్రథమస్థానంలో నిలిచిందని కోచ్ శ్రీనివాస్‌కుమార్ శుక్రవారం తెలిపారు. కాకినాడజిల్లాకు చెందిన మౌనిక, పావని, ఐశ్వర్య జూనియర్స్ విభాగంలో, సబ్‌జూనియర్స్ విభాగంలో కృష్ణవేణి, సత్య పాల్గొని విజయంలో కీలకపాత్ర పోషించారన్నారని తెలిపారు.

30న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో ఈనెల 30న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె లచ్చారావు వివరించారు. టెక్ మహేంద్ర కంపెనీలో బీపీఓ, ఫ్లూయింటు కంపెనీలో బిజినెస్ డెవలప్‌మెంట్ అసోసియేట్, ఖజానా జ్యూయలర్స్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్, క్యాషియర్, ఆఫీస్ అసిస్టెంట్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ ప్రొడక్షన్, నిట్ (ఐసీఐసీఐ) బ్యాంక్‌లో రిలేషన్ షిప్ మేనేజర్, సోలార్ యాక్టీవ్ ఫార్మసైన్సెస్‌లో ప్రొడక్షన్ టెక్నిషియన్, రిలయన్స్ రిటైల్‌లో పికింగ్ అండ్ ప్యాకింగ్, శ్రీకాళహస్తి, పైప్స్ లిమిటెడ్, ఇండో ఎంఎం కంపెనీల్లో టెక్నిషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బిటెక్ ఉత్తీర్ణులైన 30 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. నెలకు రూ 12 వేల నుంచి రూ. 25 వేల వరకు జీతం, ఇన్సెంటీవ్స్ భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులందరూ ఈనెల 30వ తేదీ ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయంలో సర్టిఫికెట్స్ జెరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు.

పర్యావరణ రక్షణలో భాగస్వాములు కావాలి

- కలెక్టర్ మాధవీలత
- ఉత్సాహంగా కలశ యాత్ర



కలశయాత్రలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ మాధవీలత అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఇతర అధికారులతో కలిసి శుక్రవారం నా భూమి – నాదేశం కలశ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి 7,500 కలశాల్లో సేకరించిన మట్టి, మొక్కలను ఢిల్లీకి తీసుకువెళ్లి జాతీయ యుద్ధ స్మారక చిహ్నం దగ్గర అమృత వాటిక నిర్మిస్తారన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జిల్లాలోని 18 మండలాలు, మూడు పట్టణ ప్రాంతాల నుంచి మట్టి, నీరు, బియ్యం సేకరించి ఢిల్లీలో అందజేస్తామన్నారు. ప్రత్యేక రైలులో రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి వచ్చే అధికారుల బృందాలు శనివారం విజయవాడ చేరుకుని, ఢిల్లీకి బయలుదేరతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 300 గ్రామ పంచాయతీల నుంచి మట్టిని సేకరణ చేపట్టి, ప్రతి మండలం నుంచి రెండేసి కలశాలు జిల్లా ప్రధాన కేంద్రానికి చేరుకున్నాయన్నారు. జిల్లా తరఫున నోడల్ అధికారిగా డ్వామా ఏవో జె.సూర్యనారాయణను నియమించామన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, ప్రాజెక్ట్ డైరెక్టర్ (డ్వామా) పి.జగదాంబ, డ్వామా ఏపీడీలు జి.శ్రీనివాస్, పీఎస్ అప్పలరాజు, ఏవో జె.సూర్యనారాయణ పాల్గొన్నారు.

స్కవర్ స్లూయిజ్ ద్వారా పూడికతీత

- గేట్లు ఎత్తి 4,800 క్యూసెక్కుల నీరు విడుదల



బొబ్బర్లంక వద్ద నీటిని విడుదల చేస్తున్న హెడ్‌వర్క్స్ ఈఈ కాశీ విశ్వేశ్వరరావు

ఆత్రేయపురం: సెంట్రల్ డెల్టా ప్రధాన కాలువలకు సాగు నీరు సక్రమంగా అందించేందుకు స్కవర్ స్లూయిజ్ ద్వారా సిల్ట్ తొలగింపు కార్యక్రమాన్ని శుక్రవారం అధికారులు చేపట్టారు. గోదావరి హెడ్ వర్క్స్ ఈఈ ఆర్.కాశీ విశ్వేశ్వరరావు ఉదయం 8 గంటలకు బొబ్బర్లంక సెంట్రల్ డెల్టాకు సాగునీరు విడుదల చేసి పూడికతీత పనులకు శ్రీకారం చుట్టారు. ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక వద్ద సెంట్రల్ డెల్టా స్కవర్ స్లూయిజ్‌కు సంబంధించిన గేట్లను తెరచి నీటిని విడుదల చేశారు. ఈఈ కాశీ విశ్వేశ్వరరావు విలేకర్లతో మాట్లాడుతూ ఎగువనున్న బురద మట్టి తొలగించడానికి ఈ కార్యక్రమం ఏటా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్కవర్ స్లూయిజ్ ద్వారా 4,800 క్యూసెక్కులు విడుదల చేసినట్లు తెలిపారు. దీంతో ఎగువన పేరుకుపోయిన బురద, మట్టి ఈ నీటి ప్రవాహం ద్వారా గోదావరి దిగువకు చేరుకుంటుందన్నారు. ఇలా చేయడం వల్ల వచ్చే రబీ సీజన్‌కు ఇసుక మేటలు తొలగిపోయి పంట పొలాలకు నీరు సక్రమంగా అందుతుందన్నారు. వర్షాకాలంలో వరదల కారణంగా ఏటా ఒండ్రుమట్టి, చెత్త, ఇసుకతో మేటలు ఏర్పడతాయన్నారు. వర్షాకాలం వెళ్లిన తరువాత స్కవరింగ్ స్లూయిజ్ గేట్లను తెరవడంతో ఇన్‌టేక్ కాలువలో సిల్ట్ చాలా వరకు తొలగిపోతుందని వివరించారు. సిల్ట్ కారణంగా రీడింగ్‌లో నీరు ఎక్కువ విడుదల చేసినట్లు ఉన్నప్పటికీ విడుదలయ్యే నీరు మాత్రం తక్కువ ఉంటుందని తెలిపారు. గేట్లును పైకి లేపి ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు నీటిని సముద్రంలోకి విడిచిపెట్టారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మాధవీలత, చిత్రంలో ఎమ్మెల్యే గోరంట్ల, చందన నాగేశ్వర్, జేసీ తేజ్ భరత్

- కలెక్టర్ మాధవీలత
- జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 138 అర్జీలు

రాజమహేంద్రవరం రూరల్: జగనన్నకు చెబుదాం (జేకేసీ) ద్వారా క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో శుక్రవారం రాజమహేంద్రవరం రూరల్ మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, జేసీ ఎస్.తేజ్ భరత్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్, డీఆర్వో జి.నరసింహం, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. వివిధ సమస్యలపై ప్రజలు 138 అర్జీలు అందజేశారు.

అర్జీల పరిష్కారంపై దృష్టి

కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ప్రతి ఒక్క అర్హత కలిగిన అర్జీకీ వారం రోజుల లోగా పరిష్కారం చూపడం జరుగుతుందన్నారు. జిల్లా అధికారులు ఆ మేరకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జేకేసీలో స్వీకరించిన అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు, వాటి తదుపరి పరిష్కార చర్యల ప్రగతిని పర్యవేక్షణ చేసేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ జలజీవన్ మిషన్ కింద చేపడుతున్న పనుల నిధులను ఖర్చు చేయకపోవడంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించాలన్నారు. ఏపీజీఅండ్‌బీసీ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పనులు సమాంతరంగా చేపట్టడం జరుగుతోందన్నారు. మండలంలో అర్జీలను సంబంధిత అధికారులు త్వరితగతిన పరిష్కరించేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని చందన కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పి.జగదాంబ, కేవీ కృష్ణారావు, జి.శ్రీనివాసరావు, ఎస్‌జీటీ సత్య గోవింద్, ఏ.ముఖలింగం, ఎన్వీ సత్యనారాయణ, కె.విజయ కుమారి, జి.పరశురామ్, ఏటీవీ రెడ్డి, ఎస్.అబ్రహం, కేఎన్ జ్యోతి, డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డాక్టర్ ఎం.సనత్ కుమారి, కె.విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడిన చంద్రబాబుపై చర్యలు తప్పవు

- స్కాంలపై నోరు విప్పని యనమల రామకృష్ణుడు
- టీడీపీ దుష్టపాలనను ప్రజలు మర్చిపోలేదు.
- రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దాడిశెట్టి రాజా

తొండంగి: స్కిల్ డెవలప్‌మెంటు స్కాంలో కోట్ల మేర ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన చంద్రబాబుపై చట్టపరంగా చర్యలు తప్పవని రాష్ట్ర రోడ్లు,భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. ఆంధ్రకు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా తొండంగిలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ గృహసారథులు, గ్రామకన్వీనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్కిల్ స్కాంకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ విభాగం ఆధారాలు సేకరించి సీబీఐ ద్వారా కేసులు పెట్టించిందన్నారు. అందులో భాగంగా సీబీఐ ఇక్కడ చంద్రబాబుపై కేసు నమోదు చేసిందన్నారు. ఇందుకు భిన్నంగా చంద్రబాబును అరెస్టుకు జగన్ కారణమంటూ దుష్ట చతుష్టయం దుష్ప్రచారం చేస్తోందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా నాటి ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అన్నీ తానై నడిపించారన్నారు. ఇప్పుడు యనమల నోరు విప్పకుండా అధికార పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఆర్థిక మంత్రి అనుమతులు లేకుండా ప్రజాధనం దుర్వినియోగం జరిగే అవకాశం లేదన్నారు. దుష్టపాలన సాగించిన చంద్రబాబు అరెస్టుపై టీడీపీ పాలనలో దోచుకున్న నాయకులకు మాత్రమే బాధగా ఉందన్నారు.

సంక్షేమానికి చిరునామా

ప్రజల వద్దకు నేరుగా ప్రభుత్వ సేవలు తీసుకువెళ్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి వైఎస్సార్ బాటలోనే ప్రజా సంక్షేమపాలన అందిస్తున్నారని మంత్రి రాజా చెప్పారు. రెండు లక్షల పైచిలుకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారన్నారు. గ్రామసచివాలయ, ఇతర విభాగాల్లో నాలుగున్నర లక్షల మంది ఉద్యోగులుగా ఉన్నారన్న సంగతి మరువరాదన్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామికపరంగా అభివృద్ధి చేసేందుకు తీరప్రాంతాల్లో మినీపోర్టు, ఫిషింగ్ హార్బర్లు నిర్మిస్తున్నారన్నారు. విద్య,వైద్య, ప్రజారోగ్య రంగాల్లో నాడు-నేడు ద్వారా మౌలికవసతుల కల్పించారన్నారు. ఎన్నికల హామీలను నూరుశాతం నెరవేర్చేందుకు కృషిచేస్తున్నారన్నారు. నవరత్నాలతోపాటు అన్ని సంక్షేమ పథకాలు సక్రమంగా కొనసాగాలంటే ముఖ్యమంత్రిగా జగన్ రావాలన్నారు. టీడీపీ ఎల్లో మీడియా ద్వారా తప్పుడు ప్రచారంతో బురద చల్లేందుకు విశ్వప్రయత్నాలు చేస్తోందన్నారు. గృహసారథులు, కన్వీనర్లు జగన్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని ప్రజలకు మరింతగా వివరించాలన్నారు. తుని వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, మాజీ చైర్మన్ కొయ్యా మురళి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి రాజా స్థానికులతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వైస్.ఎంపీపీ నాగం గంగబాబు, జేసీఎస్ జిల్లా కన్వీనర్లు ఒమ్మి రఘురామ్, జిల్లా కన్వీనర్-2 బత్తుల సాయిరామ్, వైఎస్సార్‌సీపీ మత్స్యకార విభాగం తుని నియోజకవర్గ కన్వీనర్ మేరుగు ఆనందహరి, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, మండల కన్వీనర్ బద్ది నూకరాజు, యూత్‌కన్వీనర్ ఆరుమిల్లి ఏసుబాబుచౌదరి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మలికిపురం: మండలంలోని రామరాజులంక గ్రామంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన ఈద హెబ్రా శాస్త్రి(29) మృతి చెందాడు. రాజోలు ప్రభుత్వాసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా చేస్తున్న శాస్త్రి స్వగ్రామం రామరాజులంక వచ్చి తిరిగి రాజోలు వెళ్తుండగా అదే గ్రామంలో బైక్ అదుపు తప్పింది. బైక్ రోడ్డు పక్కన పడి ఉండగా పక్కనే గల డ్రైన్‌లో శాస్త్రి కూరుకుపోయాడు. ఎవరూ గమనించ లేదు. శుక్రవారం ఉదయం 9 గంటలకు డ్రైన్ నుంచి చేతులుపైకి లేచాయి. గమనించిన స్థానికులు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంపత్‌కుమార్ తెలిపారు.

వాహనం బ్రేక్ ఫెయిలై..

ప్రమాదంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతి, మరొకరికి గాయాలు

మలికిపురం: కూల్ డ్రింక్స్‌తో వెళ్తున్న నాలుగు చక్రాల వాహనం బ్రేక్ ఫెయిల్ కావడంతో మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం గ్రామంలో శుక్రవారం రోడ్డు ప్రమాదం సంభవించింది. రాజోలు వైపు నుంచి వస్తున్న ఈ వాహనం అదుపు తప్పింది. కత్తిమండలో జరుగుతున్న వైఎస్సార్ సీపీ సమావేశానికి మోటార్ సైకిల్‌పై వస్తున్న అంతర్వేది గ్రామానికి చెందిన మేడిది జగపతి, పోతురాజు బాల నారాయణరావును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మేడిద జగపతి అక్కడికక్కడే చనిపోగా, నారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. జగపతి మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.సంపత్‌కుమార్ తెలిపారు.

కొండ దిగువనా వసతుల అండ

- సత్యదేవుని భక్తుల కోసం నాలుగు విశ్రాంతి షెడ్లు
- దేవస్థానం కళాశాల మైదానంలో రూ.1.40 కోట్లతో నిర్మాణం
- ఒక దానిలో రూ.వందకు అద్దెకిచ్చేలా మంచాల ఏర్పాటు

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి టూరిస్ట్ బస్‌లలో వచ్చే భక్తులకు శుభవార్త. కార్తికమాస ఏర్పాట్లలో భాగంగా భక్తులు కొండదిగువన సేద తీరేందుకు దేవస్థానం కళాశాల మైదానంలో ఆరు షెడ్లు నిర్మిస్తోంది. భక్తులు తమ టూరిస్ట్ బస్‌లను దేవస్థానం కళాశాల మైదానంలో నిలుపుదల చేసి అక్కడే స్నానం చేసి తీరికగా సత్యదేవుని ఆలయానికి వెళ్లేందుకుగాను ఈ విశ్రాంతి షెడ్లు నిర్మిస్తోంది. రూ.1.40 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ షెడ్లు మరో రెండు వారాల్లో భక్తులకు అందుబాటులోకి రానున్నాయి.


దేవస్థానం కళాశాల మైదానంలో నిర్మిస్తున్న భక్తుల విశ్రాంతి షెడ్లు


కళాశాల మైదానంలో నిలిపివేసిన టూరిస్ట్ బస్సులు

భక్తుల ఇబ్బందులు తొలగేలా..

సత్యదేవుని సన్నిధికి టూరిస్ట్ బస్‌లలో వచ్చేవారు కూడా అధికం. ఉత్తరాంధ్ర, ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో టూరిస్ట్ బస్‌లలో సత్యదేవుని ఆలయానికి వస్తుంటారు. వీరు తమ బస్‌లను జూనియర్ కళాశాల మైదానంలో నిలుపుదల చేసి సత్యదేవుని ఆలయానికి వెళుతుంటారు. ఇప్పటి వరకు ఆ భక్తులకు విశ్రాంతి తీసుకునేందుకు షెల్టర్లు లేవు. పేరుకు మాత్రమే టాయిలెట్స్ ఉన్నాయి. వాటి నిర్వహణ సరిగా ఉండేది కాదు. దీనికితోడు వంట చేసుకోవడానికి సరైన సదుపాయాలు లేక ఆరుబయట వంట చేసుకోవల్సి వచ్చేది. దీంతో చాలా ఇబ్బంది పడేవారు.

దసరా సీజన్‌లో భవానీ మాల వేసుకుని విజయవాడ దుర్గగుడికి వెళ్లే భవానీలు తిరుగు ప్రయాణంలో తమ టూరిస్ట్ బస్‌లను కూడా దేవస్థానం కళాశాల మైదానంలో నిలిపి స్వామివారి దర్శనం చేసుకుంటున్నారు. వీరు కూడా సరైన వసతులు లేక ఇబ్బంది పడేవారు.

అన్ని వసతులతో..

దేవస్థానం ఈఓగా చంద్రశేఖర్ అజాద్ బాధ్యతలు స్వీకరించాక టూరిస్ట్ బస్‌లలో వచ్చేవారి కోసం, రత్నగిరిపై వసతి గదులు లభించని భక్తుల కోసం నాలుగు షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఒక్కో షెడ్డు రూ.35 లక్షలు అంచనా వ్యయంతో నిర్మిస్తున్నారు. ఒక షెడ్డులో మంచాలు వేసి వాటిని భక్తులకు మంచం రూ.వంద కు అద్దెకిస్తారు. రెండో షెడ్డు పూర్తిగా పురుషుల కోసం, మూడో షెడ్డు మహిళలు సేదతీరేందుకు నిర్మిస్తున్నారు. నాలుగో షెడ్డులో వంట చేసుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు ఈ షెడ్డులోనే వంట చేసుకోవడానికి అనుమతిస్తారు. కళాశాల మైదానంలో ఎక్కడా వంట చేసుకునేందుకు అనుమతించరు. వీటికి దూరంగా ఒక షెడ్డులో పురుషులకు, మహిళలకు విడి విడిగా టాయిలెట్స్ నిర్మిస్తున్నారు. త్వరలోనే వీటి నిర్మాణం పూర్తి కానుంది.

కార్తిక మాసం ఏర్పాట్లలో భాగంగా..



కార్తిక మాసంలో వచ్చే భక్తుల కోసం దేవస్థానంలో అనేక ఏర్పాట్లు చేస్తున్నాం. వాటిలో ప్రధానమైంది టూరిస్ట్ బస్‌లలో వచ్చే భక్తుల కోసం కళాశాల మైదానంలో విశ్రాంతి షెడ్లు నిర్మిస్తున్నాం. నవంబర్ 10వతేదీ కల్లా వీటి నిర్మాణం పూర్తవుతుంది. ఇక్కడ భక్తులు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. టోల్‌గేట్ వద్దనే సీఆర్వో కార్యాలయం ఏర్పాటు చేసినందున భక్తులకు వసతి గదులు లభ్యమయ్యేది లేనిది అక్కడే తెలిసిపోతుంది. గదులు దొరకని వారు ఈ షెడ్లలో సేద తీరే అవకాశం ఉంటుంది. ఇక్కడే స్నానంచేసి సత్యదేవుని దర్శనానికి కొండమీదకు వెళ్లవచ్చు. ఇక్కడ వంటలు చేసుకునేవారి కోసం అన్ని వస్తువులు లభ్యమయ్యేలా షాపు కూడా ఏర్పాటు చేశాం. ఒక షెడ్డులో మంచాలు వేసి రూ.వందకు మంచం అద్దెకిచ్చే ఏర్పాట్లు చేశాం. – చంద్రశేఖర్ అజాద్, ఈఓ

ఒకటి నుంచి హిందూ ధర్మ ప్రచారం

ఉప్పలగుప్తం: నవంబర్ ఒకటో తేదీ నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఉన్న 36 ప్రధాన ఆలయాల పర్యవేక్షణలో ప్రతీ గ్రామంలో హిందూ ధర్మ ప్రచారం నిర్వహిస్తామని దేవదాయ ధర్మదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎంవీ సురేష్‌బాబు తెలిపారు. మండలంలోని వాడపర్రులో పండితుడు సుదర్శనం వెంకట జనార్ధనాచార్యులు వైఖానస దివ్య కల్యాణ ఉత్సవ విధి గ్రంథాన్ని రచించారు. సంయుక్త కమిషనర్ సురేష్‌బాబు, ఉప కమిషనర్ ఎమ్.విజయరాజు ముఖ్య అతిథులుగా ఈ గ్రంథాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. విజయరాజు మాట్లాడుతూ ఈ గ్రంథం సనాతన ధర్మంలో ముఖ్యమైన విషయాలను వివరిస్తుందన్నారు. సభలో అర్చకుల కోరిక మేరకు రానున్న రోజుల్లో జిల్లాకు ఐదుగురు చొప్పున యువకులకు వేద విద్యలో శిక్షణ ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రాంతీయ సంయుక్త కమిషనర్ కె.ఎస్.వి.డి.వి.ప్రసాద్, డివిజన్ ఇన్‌స్పెక్టర్ జె.రామలింగేశ్వరావు, బిక్కవోలు కేశవాచార్యులు, ఖండవల్లి కిరణ్‌కుమార్, కృష్ణమాచారి, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.


గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు, పండితులు

నేటి సాయంత్రం సత్యదేవుని ఆలయం మూసివేత


అన్నవరం దేవస్థానం

అన్నవరం: చంద్ర గ్రహణం శనివారం రాత్రి 01–05 గంటలకు ఏర్పడుతున్న సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో స్వామివారి దర్శనాలు సాయంత్రం ఐదు గంటలకు నిలిపివేస్తారు. ఈ సందర్భంగా సత్యదేవుని వ్రతాలు, ఇతర సేవా కార్యక్రమాల టిక్కెట్లు శనివారం మధ్యాహ్నం 1–30 గంటల వరకు మాత్రమే విక్రయిస్తారని తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలు లోపు వ్రతాలు, అన్ని పూజా కార్యక్రమాలు పూర్తి చేస్తారు. ఆదివారం ఉదయం ఐదు గంటలకు ఆలయాన్ని తెరిచి సంప్రోక్షణ చేసిన అనంతరం ఉదయం 7–30 గంటలకు తిరిగి స్వామివారి దర్శనాలకు భక్తులను అనుమతిస్తారని అధికారులు తెలిపారు.

టీడీపీ నాయకులవి వికృత చేష్టలు

- మద్యాభిషేకం పేరుతో పిచ్చి పనులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ శ్రీనివాస్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): తెలుగుదేశం పార్టీ నాయకుల వికృత చేష్టలు పరాకాష్టకు చేరుకున్నాయని వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మద్యాభిషేకం చేసి అగౌరపరిచిన టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలంటూ శుక్రవారం స్థానిక మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ జగనాసుర వధ అంటూ దిష్టిబొమ్మలు దహనం చేయడం, చిత్రపటాలకు మద్యంతో అభిషేకం చేయడం వంటి పిచ్చి పనులను టీడీపీ నాయకులు మానుకోవాలన్నారు. హిందూ ధర్మాన్ని మంట కలిపేలా వ్యవహరించడం తగదన్నారు. చంద్రబాబునాయుడు జైలులో ఉండడంతో టీడీపీ నాయకులకు పిచ్చి పట్టిందని ఆరోపించారు. టీడీపీ నాయకులపై స్థానిక ఒకటో, రెండో పట్టణ పోలీస్ స్టేషన్లలో కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఆయన వెంట నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఉమా రామలింగేశ్వరస్వామి దేవస్థానం ట్రస్టుబోర్డు కమిటీ చైర్మన్ అరిగెల బాబు, రమా సత్యనారాయణస్వామి దేవస్థానం ట్రస్ట్ కమిటీ చైర్‌పర్సన్ దుంగా మంగ, మార్కండేయేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ ఇన్నమూరి దీపు, విశ్వేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఎస్.దుర్గాశ్రీనివాస్, నేతలు కడలి వెంకటేశ్వరరావు, పోలు విజయలక్ష్మి, లంక ప్రసాద్, సాలా సావిత్రి, రేగుళ్ల నాని, సత్తిబాబు, రాఘవేంద్ర యాదవ్, పవన్ నాయుడు, దాసరి ప్రసాద్, ఉదయ్ రాణా, పీత రామకృష్ణ, ఉల్లూరి రాజు ఉన్నారు.


మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న డాక్టర్ శ్రీనివాస్

తొట్టి ఆటో బోల్తా పడి ఒకరు మృతి

ముగ్గురికి తీవ్ర గాయాలు


మృతుడు దివాకర్ నారాయణ (ఫైల్)

ప్రత్తిపాడు: తొట్టి ఆటో బొల్తా పడి ఒకరు మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన ఘటన ప్రత్తిపాడు మండలం ఏలూరు గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానిక పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... ఏలూరు గ్రామంలోని మల్లికా సప్లయి కంపెనీకి చెందిన తొట్టి ఆటో ఏలేశ్వరం వెళుతోంది. దీనిలో అదే గ్రామానికి చెందిన ఆకుల దుర్గా సుబ్రహ్మణ్యం, పాసిల శివ, దాడిశెట్టి దొరబాబు, యడ్ల దివాకర్ నారాయణ కూలిపనికి వెళ్లేందుకు ఎక్కారు. ఈ ఆటో ఆ గ్రామానికి చెందిన రొంగల సూర్యారావు పొలం సమీపానికి వెళ్లేసరికి రోడ్డుపై ఉన్న కంకర రాళ్ళ వల్ల అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న ఎడ్ల దివాకర్ నారాయణ (16) అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. వీరి స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం ఆకుల దుర్గా సుబ్రహ్మణ్యం, దాడిశెట్టి దొరబాబులను మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. మృతుని తండ్రి యడ్ల తాతారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బోల్తా పడిన తొట్టి ఆటో

చదువుకుంటూ కూలి పనికి...

మృతుడు దివాకర్ నారాయణ సమీపంలోని ఏలేశ్వరం మండలం సిరిపురం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. సెలవు రోజుల్లో కూలిపనికి వెళుతూ తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. రోజు వారీ కూలిపనితో కుటుంబాన్ని సాకే యడ్ల తాతారావుకు కొడుకు సాయపడుతూ వస్తున్నాడు. కొడుకు మృతి చెందడంతో అతను కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు. దివాకర్ మృతిని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు.

సెలవెరుగని ఉద్యోగి!

అరుదైన 36 ఏళ్ల ఉద్యోగ ప్రస్థానం


కడారి సుబ్బారావు, అసిస్టెంట్ డైరెక్టర్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రభుత్వ ఉద్యోగమంటే ఏడాదిలో చాలా సెలవులుంటాయి. అతి తక్కువ మంది ఈ సెలవుల వినియోగంలో పొదుపుగా వ్యవహరిస్తారు. అత్యవసరానికి తప్ప మరే పనికీ సెలవు పెట్టారు. కానీ కడారి సుబ్బారావు తన 36 ఏళ్ల ఉద్యోగ ప్రస్థానంలో ఒక్కరోజూ సెలవు తీసుకోలేదంటే ఆశ్చర్యమే మరి. కాకినాడ జిల్లా విద్యాశాఖలో కడారి సుబ్బారావు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. గొల్లప్రోలుకు చెందిన ఈయన 1987లో గ్రూప్–4 ఏపీపీఎస్సీ ద్వారా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరారు. అంచెలంచెలుగా వివిధ హోదాల్లో పనిచేసి అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయికి చేరుకున్నారు. ఉద్యోగ జీవితం 36 ఏళ్ల 8 నెలల కాలంలో ఒక్క సెలవు తీసుకోలేదు. ఈ నెల 30న రిటైర్ కానున్నారు. 2003 నుంచి ఇప్పటి వరకూ 6 సార్లు ఉత్తమ జిల్లా స్థాయి ఉద్యోగిగా, 2009లో తెలుగు అకాడమీ పురస్కారం సాధించారు.

రాష్ట్ర స్థాయి సెలెక్షన్స్‌కు..



రోషన్‌కుమార్, కృష్ణమనోహర్

అల్లవరం: అల్లవరం మండలం కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు పాశ్వన్ రోషన్‌కుమాక్, ఉంద్రు కృష్ణమనోహర్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సాఫ్ట్‌బాల్, బేస్ బాల్ క్రీడలకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం ఎంఎస్ఎన్‌మూర్తి శుక్రవారం తెలిపారు. నవంబర్ 5,6 తేదీల్లో ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగే రాష్ట్ర స్థాయి సెలెక్షన్‌కు హాజరుకానున్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయి సెలక్షన్‌లో చోటు సాధించిన క్రీడాకారులను సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పినమాల కనకదుర్గా భవాని, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆకట్టుకున్న 'ఓపెన్ హౌస్'

పాల్గొన్న ప్రజాప్రతినిధులు, విద్యార్థులు


ఆయుధ సంపత్తిని తిలకిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి, ఎమ్మెల్సీ పద్మశ్రీ, చంద్రకళాదీప్తి, శివప్రసన్న


వివిధ రకాల తుపాకులను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు

కాకినాడ: జిల్లా పోలీస్ కార్యాలయ అర్మ్‌డ్ రిజర్వు ఆవరణలో ఓపెన్ హౌస్ పేరుతో నిర్వహించిన ఆయుధ ప్రదర్శన ఆకట్టుకుంది. జిల్లాలో పలు పాఠశాలల విద్యార్థులు వాటిని తిలకించారు. జిల్లా ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మాజీ కార్పోరేటర్ రాగిరెడ్డి బన్నీ తదితరులు పాల్గొన్నారు. డయల్ 100, దిశ యాప్, డయల్ 112, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోలీసు అధికారుల ర్యాంకులు, వారి విధులు, సమాజంలో పోలీసుల పాత్రపై అవగాహన కల్పించామన్నారు. అదనపు ఎస్పీలు శ్రీనివాస్, సత్యనారాయణ, ప్రేమ్ కాజల్ పాల్గొన్నారు.

'సారణ'కు వరుడు కావలెను!



డాక్టరు గౌరీ శేఖర్, రమాదేవి దంపతులు ముద్రించిన ఆహ్వాన పత్రిక


వివాహం కోసం వరమాలతో స్వయంవరంలో పాల్గొననున్న గో మాత 'సారణ'

- గోమాతకు స్వయంవరం ప్రకటించిన వైద్యుడు
- రేపు ఏపీఎస్పీ సమీపంలో తిరుమల ఆస్పత్రి వద్ద వివాహ వేడుక
- స్వయంవరం అనంతరం కల్యాణోత్సవం
- కంచి, తిరుపతి, తిరువణ్ణామలై నుంచి రానున్న వేద పండితులు

కాకినాడ రూరల్: ఈ చిత్రంలో కనిపిస్తున్న గో మాత పేరు సారణ. కాకినాడ రూరల్ రమణయ్యపేటలో ఏపీఎస్పీ ఎదురుగా తిరుమల ఆస్పత్రి వైద్యుడు గౌరీశేఖర్ గారాల పట్టి. తనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నా.. వారి కంటే ఎక్కువ ప్రేమను సారణపై చూపుతారు. సరిగ్గా 20 నెలల క్రితం అనగా 2022జనవరి 22న సారణకు బారసాల, ఊయల వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించి సారణగా నామకరణం చేశారు. అప్పట్లో మీడియాలో గోమాతకు బారసాల పెద్ద వైరల్ అయ్యింది. ఇప్పుడు 21వ మాసంలోకి అడుగిడిన సారణకు వివాహ వయసు రావడంతో వైద్యులైన గౌరీశేఖర్, రమాదేవీ దంపతులు స్వయంవరం ప్రకటించారు. ఆదివారం ఉదయం 9గంటలకు నుంచి స్వయంవరం ప్రారంభం కానుంది. వివిధ ప్రాంతాలలోని నందీశ్వరులకు ఆహ్వానం పంపారు. ఏపీఎస్పీ ఫంక్షన్ హాలు వద్ద ఖాళీ స్థలంలో సుమారు 12 నందీశ్వరులను వరుసలో ఉంచగా వరమాలతో సారణ తనకు నచ్చిన నందీశ్వరుడిని ఎంపిక చేసుకోనుంది. తరువాత ఫంక్షన్ హాలులో వివాహ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇందుకోసం కంచి, తిరుపతి, తిరువణ్ణామలై నుంచి వేద పండితులు వస్తున్నారని, శాస్త్రోక్తంగా కల్యాణం జరుపుతారని డాక్టరు గౌరీశేఖర్ తెలిపారు.

విద్యార్థి దుర్మరణం

- వెనుక నుంచి ఢీకొట్టిన లారీ
- మండపేటలో విషాదం


మహేష్ (ఫైల్)

మండపేట: స్కూలుకని బయలుదేరిన కొడుకు తిరిగిరాని లోకాలకు తరలిపోవడం తల్లిదండ్రులను శోకసంద్రంలో ముంచింది. మండపేట సత్యశ్రీ రోడ్డులో శుక్రవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో తొమ్మిదవ తరగతి విద్యార్థి మృతి చెందడం పట్టణంలో విషాదాన్ని నింపింది. స్థానిక సంఘం కాలనీకి చెందిన కోనె మహేష్ సత్యశ్రీ రోడ్డులోని ఎస్ఎస్‌వీవీ మున్సిపల్ హైస్కూల్‌లో తొమ్మిదవ తరగతి చదువుతున్నాడు. రోజూ మాదిరి ఉదయం కాలనీ నుంచి సైకిల్‌పై పాఠశాలకు బయలుదేరాడు. బైపాస్ రోడ్డు దాటి కోళ్ల ఫారాల మలుపు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో మహేష్ అక్కడికక్కడే మృతిచెందాడు.

డ్రైవర్ నిర్లక్ష్యంగా లారీ నడపడం, రోడ్డు బెర్ములు కిందికి కుంగిపోయి ఉండటం వలనే ప్రమాదం సంభవించిందని స్థానికులు అంటున్నారు. స్కూల్‌కు వెళుతున్న బాలుడు రోడ్డుపై మృతిచెంది ఉండటం దారిన వెళ్లే వారిని కలచివేసింది. మహేష్ మృతితో అతని కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. తండ్రి శ్రీనివాస్ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ భార్య, కుమారుడు, కుమార్తెను పోషించుకుంటున్నాడు. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న బిడ్డ కళ్లముందే విగతజీవిగా పడి ఉండటం చూసి తల్లిదండ్రులు విలపించిన తీరు చూపరులకు కంటతడి పెట్టించింది. పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఘటనా స్థలంలో విలపిస్తున్న మహేష్ తండ్రి